సాక్షి మంచిర్యాల

సోమవారం । 15 । జనవరి । 2024



అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు

8లో▸

ఉమ్మడి జిల్లాలో రామనామం మార్మోగుతోంది. అయోధ్య అక్షింతలు ఇంటింటికీ వస్తుండడంతో రామయ్య ఆశీస్సులు అందినట్లు భావిస్తున్నారు.



'నాగోబా' ప్రచారయాత్ర షురూ

పుష్యమాసం అమావాస్య పురస్కరించుకొని శనివారం రాత్రి నెలవంక చూసిన మెస్రం వంశీయులు ఆదివారం నాగోబా మహాపూజ ప్రచార రథాన్ని ప్రారంభించారు.

10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /16.7

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉంది.

సంక్రాంతి వచ్చింది..

- సూర్యుడి మకర ప్రవేశం..
- ధాన్యలక్ష్మి గృహ ప్రవేశం..

మూడు రోజుల సంక్రాంతి పండుగ ఆదివారం భోగి వేడుకలతో ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెల్లో వేకువ జామునే భోగి మంటలు వెలిగించారు. పీడ తొలగి పోవాలని పాత వస్తువులను మంటల్లో వేశారు. యువతులు, మహిళలు భోగిమంటల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. అనంతరం భోగి స్నానాలు ఆచరించారు. కొత్త బట్టలు ధరించి ఆలయాల్లో పూజలు చేశారు. అందరికీ భోగ భాగ్యాలు ప్రసాదించాలని ఇష్టదైవాలను వేడుకున్నారు. సాయంత్రం చిన్న పిల్లలకు భోగిపండ్లు పోశారు. దిష్టి తీశారు. భోగి సందర్భంగా మహిళలు ఇళ్ల ముంగిళ్లలో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. సోమవారం సంక్రాంతి. సంక్రాంతి లేదా సంక్రమణం అంటే మారడం. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో చేసుకునే పండుగ. ఖరీఫ్ పంటలు చేతికి వచ్చి ధాన్యలక్ష్మి రైతుల ఇళ్లకు చేరే శుభవేళ కూడా ఇదే. ఇక ఆంగ్ల సంవత్సరంలో తొలి పండుగ సంక్రాంతి. తెలుగువారికి పెద్ద పండుగ. ఆదివారం భోగి పూజలతో మూడు రోజుల పండుగ ప్రారంభమైంది. సోమవారం సంక్రాంతి జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. - మంచిర్యాలఅర్బన్



మంచిర్యాల టౌన్ : సంక్రాంతి వేడుకలకు న్యూజిలాండ్ నుంచి వచ్చిన కుటుంబం





మంచిర్యాల టౌన్ : భోగి మంటలు వేసిన వాకర్స్



కాసిపేట : చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న తల్లిదండ్రులు



మంచిర్యాల అర్బన్ : రెడ్డి కాలనీలో భోగి వేడుకలు..

రమణీయం..గోదా రంగనాథుల కల్యాణం



హాజీపూర్ : గోదారంగనాయకుల కల్యాణం జరిపిస్తున్న పండితులు



భీమారంలో గోదారంగనాథుల కల్యాణం..



కొలువుదీరిన గోదా రంగనాథులు

- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం భోగి సందర్భంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణోత్సవం రమణీయంగా నిర్వహించారు. వేదమంత్రాలు..బాజాభజంత్రీల నడుమ నిర్వహించిన కల్యాణ వేడుకను తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. హరినామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముత్తయిదువులు గోదా మాతకు ఒడిబియ్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. - మంచిర్యాల అర్బన్



బెల్లంపల్లిలో గోదా రంగనాథుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు..

న్యూస్‌రీల్

భారత్ జోడో న్యాయ్ యాత్రలో చెన్నూర్ ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో వివేక్ సెల్ఫీ

చెన్నూర్: మణిపూర్‌లోని తౌబాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.



మంత్రి సీతక్క, షర్మిలతో వివేక్ వెంకటస్వామి

చైనా మాంజా వాడితే కఠిన చర్యలు

- విక్రయించే వారికి ఏడేళ్ల జైలు శిక్ష
- సీపీ రెమా రాజేశ్వరి



సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: చైనా మాంజా వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని, ఎవరైన విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజా కారణంగా పక్షులు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. చైనా మాంజా ప్రాణాంతకమన్నారు. చైనా మాంజా అమ్మినవారికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.

చెదిరిన రెవెన్యూ డివిజన్ కల?

- జిల్లాలను కుదించే ఆలోచనలో ప్రభుత్వం
- కొత్త డివిజన్లు, కొత్త మండలాల ఏర్పాటుకు విముఖత

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ ప్రజల రెవెన్యూ డివిజన్ కల చెదిరింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం 2023, అక్టోబర్ 4న చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తోపాటు అస్నాద, పారుపల్లిని మండలాలు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల కుదింపునకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో చెన్నూర్ డివిజన్‌తోపాటు కొత్త మండలాలు ఏర్పాటు చేసే ఆలోచన లేనట్లు ప్రచారం జరుగుతోంది.

డివిజన్ ఏర్పడితే...

చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పడితే నియోజకవర్గ ప్రజలకు మేలు జరుగుతుంది. నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతుల భూ సమస్యలతోపాటు ఇతర అవసరాల మేరకు డివిజన్ కోసం మంచిర్యాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూర్, కోటపల్లి మండలాల ప్రజలు 40 కిలోమీటర్ల నుంచి 80 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. చెన్నూర్‌ను డివిజన్ చేస్తే చెన్నూర్‌తోపాటు కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల ప్రజలకు మేలు జరుగుతుంది. కొత్తగా ఏర్పాటు చేయాలని సంకల్పించిన పారుపల్లి, అస్నాద మండలాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.



పారుపల్లి మండల నమూనా చిత్రం

డివిజన్‌తోపాటే మండలాలు..

చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌లో చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాలతోపాటు కొత్తగా ఏర్పాటు చేస్తామన్న అస్నాద, పారుపల్లి మండలాలు డివిజన్ పరిధిలోకి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ మండలాల ప్రజలు చెన్నూర్‌కు రావాలంటే 40 కిలో మీటర్ల దూరం ఉండడంతో అన్ని మండలాల ప్రజలకు మేలు జరుగుతుంది. అయితే కొత్త ప్రభుత్వం ఆలోచన వేరేలా ఉండడంతో డివిజన్ కల నెరవేరుతుందో లేదో అని నియోజవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొత్త మండలాలు ఇలా..

గత ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త మండలాలు

అస్నాద...

అస్నాద, గంగారం, కొమ్మెర, పొక్కూర్, పొన్నారం, సోమన్‌పల్లి, నాగపూర్, బీరెల్లి, సుందరశాల, నర్సక్కపేట్, దుగ్నపల్లి.

పారుపల్లి ...

పారుపల్లి, ఆయాపల్లి, పుల్లగామ, సిర్సా, ఎదుల్లబంధం, లింగన్నపేట, ఆలుగామ, ఎర్రయిపేట, బొరంపల్లి, కావర్‌కొత్తపల్లి, అన్నారం, అర్జునగుట్ట, రాజారాం, రాంపూర్, కొల్లూర్, రాపన్‌పల్లి, దేవులవాడ, పిన్నారం, రొయ్యలపల్లి ఉన్నాయి.

మార్కెట్ పదవులపై ఆశలు!

- పైరవీలు ప్రారంభించిన నేతలు
- ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు...

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టులపై ఆ పార్టీ నాయకులు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల పదవి కోసం నేతలు పైరవీలు మొదలుపెట్టారు. ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉన్నవారికే పదవులు వచ్చే అవకాశం ఉండడంతో వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

స్థానికులకే ఛాన్స్..

చెన్నూర్ మార్కెట్ చైర్మన్ పదవి మొదటి నుంచి చెన్నూర్‌కు చెందిన వ్యక్తులకు వరించింది. నాలుగు మండలాల స్థాయి పదవి కావడంతో గతంలో ఇతర మండలాల నాయకులు ప్రయత్నాలు చేసినా స్థానికత ఆధారంగా చెన్నూర్ వాసులకే ప్రాధాన్యం ఇచ్చారు. ఈసారి భీమారం, జైపూర్, కోటపల్లి మండలాల నేతలు కూడా పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

బీసీలకు దక్కేనా?

మార్కెట్ కమిటీ చరిత్ర చూస్తే ఓసీ, ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన వ్యక్తులకే ఇప్పటి వరకు చైర్మన్ పదవి దక్కింది. ఈసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అవకాశం ఇస్తుందో లేదో చూడాలి.




వివేక్ వెంకటస్వామిని కలిసిన అరుణ్‌కుమార్

రేసులో వీరు..

భీమారం మండలానికి చెందిన తంగళ్లపలి అరుణ్‌కుమార్ బీసీ కోటాలో చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి అత్యంత సన్నిహితుడుగా గుర్తింపు ఉంది. అరుణ్‌కుమార్ ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 2007 నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరుణ్‌కుమార్‌పై పలు కేసులు నమోదు చేయించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్‌ను వీడలేదు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నట్లు సమాచారం. చెన్నూర్‌కు చెందిన హిమవంతరెడ్డి, ఘన్‌శ్యామ్ కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. వీరితోపాటు మరికొందరు కూడా పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత రాసమల్ల అశోక్‌గౌడ్ స్మారకార్థం నిర్వహించిన మండలస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మండలంలోని 13 జట్లు పోటీలో పాల్గొన్నాయి. ఫైనల్‌లో కర్ణమామిడి-వేంపల్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కర్ణమామిడి జట్టు 12 ఓవర్లలో 105 పరుగులు చేయగా, వేంపల్లి జట్టు 12 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. విజేతగా నిలిచిన కర్ణమామిడి జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీ, పతకాలు, రన్నరప్ వేంపల్లి జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీ, పతకాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అందజేశారు. టోర్నీ నిర్వాహకులు డీజే.శేఖర్, ఒడ్డె బాలరాజు, స్థానికులు పూస్కూరి శ్రీనివాసరావు, రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్, రవి, దొమ్మటి సత్తయ్య, అంకం కృష్ణమూర్తి, తోట రవి, కారుకూరి చంద్రమౌళి, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

ఇక రోజూ తాగునీరు



మంచిర్యాలలో ప్రతీరోజు తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

- మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లో అమలు
- ప్రారంభించిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్/నస్పూర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే మున్సిపాలిటీల్లో ఇంటింటికీ నిత్యం తాగునీరు అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హామీ ఇచ్చారు. ఈమేరకు ఓటర్లు కాంగ్రెస్‌ను గెలిపించడంతో హామీ అమలుకు సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీకారం చుట్టారు. మంచిర్యాలలోని అశోక్ రోడ్డులో, నస్పూర్‌లోని 14వ వార్డు గాంధీనగర్‌లో ప్రతీరోజు తాగునీటి సరఫరాను ఆదివారం ప్రారంభించారు. ఎన్నికల సందర్భంగా మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీల ప్రజలకు నిత్యం స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చానని, ఈమేరకు హామీ నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు సమష్టిగా పనిచేయడంతో గెలిచిన నెల రోజుల్లోనే హామీ నెరవేర్చామన్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు పలుమార్లు టెస్ట్ చేశామని, స్వచ్ఛంగా ఉందని తెలిపారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి తాగునీటిని పరీక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలి పారు. నల్లా నుంచి పట్టుకుని నేరుగా తాగే నీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం గంట, సాయంత్రం అరగంట నీరు సరఫరా చేసేలా చూస్తానని వెల్లడించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి..

అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కోసం ఇటీవల ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తాగునీటి సరఫరాకు కృషి చేసిన మిషన్ భగీరథ ఈఈ మధుసూదన్, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, ఏఈ అనిల్, మంచిర్యాల మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, ఏఈ రాజేందర్, ఏఈ అరుణ్‌లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు రావుల ఉప్పలయ్య, సల్ల మహేశ్, చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, 17వ వార్డు కౌన్సిలర్ పూదరి సునీత తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్ అభివృద్ధికి కృషి..

నస్పూర్ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా పట్టణానికి తాగు నీరు అందించలేదని తెలిపారు. త్వరలో రూ.75 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తామన్నారు. రూ.10 వేల లోపు పెన్షన్ వస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు తెల్ల రేషన్‌కార్డు ఇప్పిస్తామని తెలిపారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో కబ్జా అయిన భూ ములు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. డంపుయార్డు సమస్యకు రెండు నెలల్లో శాశ్వత పరిష్కా రం చూపుతామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధును ఎమ్మెల్యే సన్మానించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మధుసూదన్, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, కౌన్సిలర్లు సురిమిల్ల వేణు, కెడిక ప్రకాశ్‌రెడ్డి, తోట శ్రీనివాస్, పూదరి కుమార్, గెల్లు రజిత, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో ప్రారంభిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు



సన్మానం పొందిన అధికారులతో ఎమ్మెల్యే

గంగాధర్‌కు సన్మానం


సన్మానిస్తున్న కౌన్సిలర్ భరత్

ఆదిలాబాద్‌టౌన్: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన కొండూరి గంగాధర్‌ను ఆదివారం సరస్వతినగర్ పంచముఖ హనుమాన్ రామాంజనేయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు సన్మానించారు. నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పేర్కొన్నారు. మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లిలో ఈ నెల 11వ తేదీన జరిగిన చోరీని పోలీసులు మూడు రోజుల్లో ఛేదించారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు... రాపల్లికి చెందిన గుండ ఐలయ్య 11వ తేదీన తన భార్య లక్ష్మితో కలిసి చేను పనుల్లో భాగంగా ఇంటికి, గేట్‌కు తాళం వేసి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటికి గేట్ తాళం తీసి ఇంట్లోకి వెళ్లే క్రమంలో ఇంటి తలుపు బెడెం విరగ్గొటి ఉంది. ఇంట్లో చూడగా బీరువాలోని రూ.70వేల నగదు, తులం బంగారు గొలుసు, 18 తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న క్రమంలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన జెట్‌పాత్ పవన్ గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. మూడు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులను రూరల్ సీఐ తోట సంజీవ్ అభినందించారు.

బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో కోడి పందేలు జరగకుండా ముందస్తుగా ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పెద్దంపేటకు చెందిన తనుగుల రమేశ్, టీకానపల్లికి చెందిన గంగాధరి తిరుపతిలను బైండోవర్ చేసినట్లు తెలిపారు. మండలంలో కోడి పందేలు నిషేధించినట్లు తెలియజేస్తు కోడి పందేలు నిర్వహించినా, పాల్గొన్న చట్టపరమైన కేసులు తప్పవని ఎస్సై తెలిపారు.



అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా శ్రీరామనామ జపం చేస్తోంది. అయోధ్య రాముడి పూజిత అక్షింతలు ఇంటింటికీ పంపిణీ జరుగతున్నాయి. జైశ్రీరాం.. రామలక్ష్మణ జానకీ.. అంటూ ఊరూవాడా, పల్లె, పట్నం అంతా కూడా కాషాయమయం అవుతుండగా శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్రగా మేళ తాళాలు, కోలాటాలు, చెక్కభజనలు, శ్రీరామ, హనుమ భజనలతో సాగుతూ ఇంటికీ చేరుతున్న అక్షింతలను మంగళ హారతులతో స్వీకరిస్తున్నారు. శ్రీరామ అక్షింతల పంపిణీలో ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా అక్షింతల పంపిణీలో భాగస్వామ్యం అవుతున్నారు.

- హారతులతో స్వాగతం పలుకుతూ స్వీకరిస్తున్న భక్తులు
- 15వ తేదీ వరకు ఇంటింటా పంపిణీ పూర్తికి సన్నాహాలు
- అక్షింతలు, ఆలయ చిత్రపటం, విశేష కరపత్రం అందజేత
- శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ


అక్షింతలకు ఆహ్వానం పలుకుతున్న భక్తులు


శోభాయాత్రలో పాల్గొన్న మహిళా భక్తులు

తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో..
అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ 22వ తేదీన జరగనుంది. అయితే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టారు. మంచిర్యాల జిల్లాలో ఈ నెల 1వ తేదీన ఆరంభం కాగా 15వ తేదీ వరకు అక్షింతల పంపిణీ పూర్తి చేసేలా కార్యక్రమం సాగుతోంది. జిల్లాకు మొత్తంగా 35 క్వింటాళ్ల అక్షింతలు వచ్చాయి.

అక్షింతల వితరణ ఇలా..
సంచాలన సమితీ సభ్యులు ప్రతీరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందంగా ఏర్పడి పంపిణీ చేస్తోంది. కలశ ప్రముఖ్ అక్షింతల కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. పలువురు మంగళహారతితో స్వాగతం పలుకుతూ అక్షింతలు స్వీకరిస్తున్నారు. అక్షింతలు, శ్రీరామజన్మభూమి మంది చిత్రపటం, ఆలయ విశేషాలు తెలిపే కరపత్రం అందజేస్తున్నారు. మంచిర్యాల జిల్లాకు వచ్చిన దాదాపు 13 క్వింటాళ్ల అక్షింతల్లో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు కూడా పంపించారు. మంచిర్యాల జిల్లాలో సుమారు 3 లక్షల కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేయాలని సంకల్పించిన నేపథ్యంలో ఇప్పటి వరకు దాదాపు 1.80 లక్షల కుటుంబాలకు అక్షింతలు వితరణ చేసినట్లు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సమయోజక్‌లు తెలియజేశారు.

ప్రాణప్రతిష్ఠ రోజున తలపై..
అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ జరుగుతున్నాయి. శ్రీరాముడి పూజిత అక్షింతలు ఈ నెల 22వ తేదీ శ్రీరామజన్మభూమి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున ఇంటిల్లిపాది ఆ పూజిత అక్షింతలను తలపై వేసుకుని శ్రీరాముడి ఆశీర్వాదం పొందుతూ శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠలో భాగస్వామ్యం అయినట్లుగా భావించాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తెలియజేస్తుంది.

భారీ శోభాయాత్ర..
జీవితంలో మళ్లీ చూడబోని శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర తలపెట్టారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం నుంచి ఆరంభమయ్యే శోభాయాత్ర వెంకటేశ్వర టాకీస్ మీదుగా గంగారెడ్డి రోడ్, విశ్వనాథాలయం, రైల్వేస్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్‌ల మీదుగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం వరకు సాగనుంది. ఇక్కడ పాల్గొనే భక్తజనులందరికీ శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రసాద పంపిణీ చేయనున్నారు.

అక్షింతల రూపంలో శ్రీరాముడు..
నిర్మల్: జిల్లాలోనూ అయోధ్యలో పూజించిన అక్షింతల పంపిణీ ఇంటింటా సాగుతోంది. ప్రతి పల్లెకూ.. ప్రతి ఇల్లుకూ చేరుతున్నాయి. రామజన్మభూమి నుంచి పంపిన అక్షింతలను ఆహ్వానిస్తూ.. రాములోరే ఈ రూపంలో తమ ఇంటికి వచ్చినట్లుగా జిల్లావాసులు భావిస్తున్నారు. అయోధ్య నుంచి నేరుగా నిర్మల్ వచ్చిన అక్షింతలను స్థానిక బాగులవాడ సరస్వతి శిశుమందిర్ పక్కన గల రామాలయంలో ఉంచి, అక్కడి నుంచి జిల్లా మొత్తం పంపిస్తున్నారు. జిల్లాలోని విశ్వహిందూపరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్, హిందూవాహిని, స్థానిక యువజన, కాలనీ సంఘాలు, ఇతర ఆధ్యాత్మిక సంస్థలూ అయోధ్య అక్షింతల పంపిణీలో భాగమవుతున్నాయి.

ఇలాంటి అవకాశం జన్మలో రాదు..



అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ పంచే అవకాశం జన్మలో రాదు. ఇది నిజంగా పూర్వజన్మ సుకృతమే. అక్షింతలు, రామమందిర ఫోటోలు, కరపత్రాలను ఇంటింటా అందిస్తూ ఉండగా ప్రతిఒక్కరూ పండుగ వాతావరణంలో మంగళహారతులతో స్వాగతిస్తూ తమకు నీళ్లారబోస్తూ అక్షింతలు స్వీకరిస్తూ ఉంటే శ్రీరాముడే ఈ అదృష్టం తమకు కలిగించినట్లు భావిస్తున్నాం.

– మన్నవ శివపావని, సంచాలన సమితీ సభ్యురాలు

27 గ్రామాల్లో పంపిణీ పూర్తి చేశాం



ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో అయోధ్య బాలరాముడి అక్షంతలు పంపిణీ చేశాం. ఈ నెల 16 వరకు అక్షంతల పంపిణీ కొనసాగనుంది. అక్షంతలను పూజా గదిలో, తినే బియ్యంతో పాటు బీరువాలో భద్రపరుచుకోవాలి. వివాహాలు, శుభకార్యాలతో పాటు కొత్త పనులు ప్రారంభించే సమయంలో ఈ అక్షంతలు వినియోగించుకోవాలని పండితులు సూచిస్తున్నారు.

– ఇరుకుల్ల ఆంజనేయులు, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్, మండల అధ్యక్షులు

మహద్భాగ్యం..



జైశ్రీరాం.. దేశమంతా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన పూజిత అక్షింతలను అందుకోవడం మహద్భాగ్యం. వీటిని ఇంటింటికే చేర్చే అదృష్టం దక్కడం చాలా ఆనందాన్నిస్తోంది.

–ముప్పిడి రవి, వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు, నిర్మల్

రామయ్య వచ్చినట్లే..



అయోధ్యలో రామాలయ నిర్మాణానికి చేపట్టిన కరసేవకు వెళ్లే అదృష్టం దక్కింది. ఇప్పుడు అదే అయోధ్యలో పూజించిన అక్షింతలను పంపిణీ చేసే అదృష్టం రావడం సంతోషంగా ఉంది. స్వయంగా ఆ అయోధ్య రాముడే తమ ఇంటికి వచ్చాడన్నట్లుగా అక్షింతలను కళ్లకు అద్దుకుని ఇంట్లోకి తీసుకెళ్లి పూజిస్తున్నారు.

–మంచిరాల నాగభూషణ్, శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా కన్వీనర్, నిర్మల్

గడప గడపకూ అక్షింతలు



ఆదిలాబాద్‌టౌన్: అయోధ్య శ్రీ రామజన్మ భూమి అక్షింతలను ఆదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో గడప గడపకు వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. జిల్లా అధికారులు, మందిరాలకు వెళ్లి అక్షింతలను అందించాం. కాలనీల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 1 నుంచి 15 వరకు అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, 16 నుంచి 21వ తేది వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమాల్లో దుర్గావాహిని, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, బజరంగ్ దళ్ తదితర హిందూ ఉత్సవ సంఘాలు పాలుపంచుకున్నారు.

- రేఖ రజిని, దుర్గావాహిని ప్రముఖ్, ఆదిలాబాద్

కూలిన ఆర్కే-5 గని పైకప్పు

- కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్కే-5 గని పైకప్పు ఆదివారం కూలింది. ఈ ఘటనలో జనరల్ మజ్దూర్ కార్మికుడు జోరుపుల నరేశ్ గాయపడ్డాడు. శనివారం నైట్ షిఫ్ట్ విధులకు హాజరైన నరేశ్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం ఉదయం 4 గంటలకు గని 4 సీమ్ 21 ఆఫ్ లెవల్‌లో బ్లాస్టింగ్ చేశారు. తర్వాత డ్రెస్సింగ్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫీటు వెడల్పు ఉన్న పైకప్పు కూలింది. అందులో కొంతభాగం నరేశ్‌పై వీపుపై పడడంతో గాయాలయ్యాయి. కదలేని స్థితిలో ఉన్న నరేశ్‌ను తోటి కార్మికులు హుటాహుటిన రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలిని గని అధికారులు, మైనింగ్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య ఆసుపత్రి వద్ద క్షతగాత్రుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.


పరామర్శిస్తున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

జోరుగా సాగుతున్న కోడి పందేలు


పట్టుబడిన కోళ్లతో పందెంరాయుళ్లు(ఫైల్)

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందెలు, జూదం ఆటలు పలు గ్రామపంచాయతీల శివారుల్లో జోరుగా సాగుతున్నాయి. మండలంలోని వెంకటాపూర్, కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి, నాయకునిపేట, లింగాల గ్రామపంచాయతీ పరిధిల్లో కోడి పందెల జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ కావడంతో పందెంరాయుళ్లు గ్రామ శివారుల్లో నిర్వహిస్తుండగా కొంత మంది వాట్సాఫ్ గ్రూపుగా ఏర్పాటు చేసుకొని ఎక్కడెక్కడ పందెంలు జరుగుతున్నాయో వారికి సమాచారం తెలియజేస్తున్నారు. పలువురు నిర్వాహకులు, పోలీసులు దాడుల నుంచి తప్పించుకునేందుకు కొంత మంది యువకులను ఆ పొలిమేరల్లో కాపలాగా పెట్టి ఆటలు సాగిస్తున్నారు. అటు వైపు అనుమానిత వ్యక్తులు, వాహనాలు వస్తే వెంటనే నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి తప్పించుకుంటున్నారు. ఇదంతా పోలీసులకు తెలిసినప్పటికీ 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత శుక్రవారం కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు పందెంరాయుళ్లతో పాటు రెండు పందెం కోడిపుంజులను, రూ.3,600 నగదును పోలీసులు పట్టుకోవడం విధితమే. ఏదిఏమైనా ఈ పందెం ఆటల్లో సర్వం కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉన్నందున పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోలీసుల దాడి

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులో ఆదివారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్న ఆకుదారి శ్రీనివాస్, చింతం బాపులను అరెస్ట్ చేసి వారివద్ద పందెం కోళ్లతో పాటు రూ.1500 స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలో ఇదివరకు పందేలు నిర్వహించిన గ్రామాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు.